# ఆనందం అంటే?

**- నిశ్చల సిద్దారెడ్డి**

ఎన్నెన్నో రోజుల్నుండి వేధిస్తున్న ప్రశ్న ఇది. నాకెవరు అడ్డమొస్తే వాళ్లందర్నీ అడిగేవాడిని ''ఆనందం అంటే ఏమిటి?'' అని. ఒక్కొక్కరు ఒక్కో విధంగా సమాధానం ఇచ్చేవారుగానీ సంతృప్తికరమైన సమాధానాన్ని నాకెవ్వరూ ఇవ్వలేకపోయారు. కాదు కాదు నాకు సంతృప్తినివ్వలేదు అంటే బావుంటుందేమో!

చిన్నప్పట్నుంచీ జవాబు దొరకనికొద్దీ సమస్యను ఓపిగ్గా శోధించి సాధించే మనస్తత్వం నాది. అలాగే ఇప్పుడు మరింత పట్టుదల, ఓపిక, శ్రద్ధలతో పట్టువదలని విక్రమార్కునిలా వెదుకుతూనే వున్నాను.

ఈ ప్రయత్నంలో నేనెందర్నో ప్రశ్నించాను ''ఆనందం అంటే ఏమిటి?'' అని. మొట్టమొదటగా మా ఆవిడ్ని ప్రశ్నిస్తే ఆవిడ ''వేళకు కడుపునిండా తిండి, కట్టుకోను సరైన బట్ట, వుండడానికి ఇల్లు, డబ్బుకు ఇబ్బందుల్లేకుండా, సమస్యలు లేకుండా ఒకర్నొకరు సరిగా అర్థం చేసుకుని పాలునీళ్లలా కల్సిపోయి భార్యాభర్తలు జీవితాన్ని గడిపితే అదే ఆనందం'' అని సుదీర్ఘమైన సుత్తి వేసింది. బహుశా ఇది కమ్మని, సంతృప్తికరమైన ఆవిడ జీవితం గురించి విశ్లేషణ అనుకుంటా. అంటే మా ఆవిడ ఆనందాన్ని చవిచూస్తున్నట్టేనా? కానీ నాకిది సరైన జవాబుగా తోచలేదు.

మర్నాడు ఉదయాన్నే మార్కెట్‌లో కనబడిన నా చిన్ననాటి స్నేహితుడ్ని అడిగాను ''ఒరేయ్! ఆనందం అంటే ఏమిటిరా?'' అని. వాడు చెప్పాడు ''అప్పుల్లేకుండా సంసారాన్ని ఈదడమే ఆనందంరా'' అని. నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థంకాలేదు. ఇదీ సరైన సమాధానం కాదనిపించింది నాకు.

తన అక్కగార్ని చూడవచ్చిన నా బామ్మర్దిని ప్రశ్నిస్తే మాంచి హుషారుమీదున్నట్లున్నాడు వాడు చెప్పాడు ''కోరుకున్న తాను మెచ్చి మనసిచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడమే ఆనందం అంటే'' అని. ప్చ్... ఇదీ సరైన సమాధానంకాదు.

మా ముసలి తల్లినడిగితే ఆవిడ చెప్పింది ''ఈ కాలంలో కూడా వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రుల్ని పువ్వుల్లో పెట్టుకుని చూసే నీలాంటి బంగారు కొడుకుని కనడమే ఆనందం అంటే'' అని.

నా ప్రశ్నకు ఇదీ సమాధానం కాదు.

నా తల్లిని అడిగినప్పుడు అక్కడే వున్న నా పుత్రరత్నం నేనడక్కపోయినా చెప్పాడు ''అడిగినంత పాకెట్‌మనీ ఇస్తూ మెరిట్‌లో సీట్ రాకపోతే డొనేషన్ కట్టి మరీ మెడిసిన్ చదివిస్తున్న నీలాంటి తండ్రి వుండడమే ఆనందం అంటే'' అని. ఇదీ సరైన సమాధానంకాదు.

ఏదో కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పని చేస్తున్న మా ఆవిడ స్నేహితురాలైన సుదీప్త నా ప్రశ్న ఎలాగో తెల్సుకుని ఫోన్‌చేసి మరీ చెప్పింది ''పెద్ద పెద్ద కోరికలు, ఆశలు పెట్టుకోకుండా ఉన్నదానితో సంతృప్తిపడడమే ఆనందం అంటే'' అని. ఎమ్మే సైకాలజీ చేస్తున్న ఆవిడ కూతురు చెప్పింది ''గుడ్ బాడ్ వాటెవ్వర్ ఇట్ మేబీ జీవితంలో ప్రతి అనుభవాన్నీ, ప్రతి క్షణాన్నీ సమానంగా తీసుకుని అనుభవించడమే ఆనందం అంటే'' అని. ఈ సైకాలజీ అమ్మాయి సమాధానం కూడా నాకు సరైనదిగా అనిపించలేదు.

అప్పుల్లో అప్పటికే నిండా కూరుకుపోయిన మరో స్నేహితుడ్ని అడిగితే వాడు చెప్పాడు ''నేపుట్టి బుద్ధెరిగాక దాన్నెప్పుడూ చూడలేదు. నేనిక నీకేం చెప్పను'' అని.

తన కూతురు పెళ్లి సంబంధం చూడను మా ఊరొచ్చిన మా చిన్నన్నాయ్ చెప్పాడు ''ఒరే అబ్బులూ! అరిగించుకోగలిగినంత కడుపునిండా లాగించెయ్యడమే ఆనందం అంటే'' అని. వీడసలే తిండిబోతు. చిన్నప్పట్నుంచీ బకాసురుడనే వారందరూ. వాడికి తిండి ఎక్కువ ఆనందకరమైన విషయం ప్రపంచంలో అన్నింటికంటే. భూమి బద్దలై వాడందులో కూరుకుపోయినా వాడికి అనవసరం. అక్కడ కూడా వాడికి తిండుంటే చాలు. కాబట్టి వీడి జవాబు పరిగణనలోకి తీసుకోదగినది కాదు.

కొత్తగా డబ్బు సంపాదనలో పడిన మా కజిన్ ఒకావిడ చెప్పింది ''వెయ్యగలిగినంత డబ్బు బ్యాంక్‌లో వేసి వడ్డీ తీసుకోవడమే ఆనందమంటే అని''. ఇదీ సరైన జవాబు కాదు.

కొత్తగా మారుతీ ఎస్టీమ్ కొన్న మా తమ్ముడు చెప్పాడు ''అన్నాయ్! అందర్లా సాధారణమైన కార్లల్లోగాక అందరికంటే కాస్తంత గొప్పగా కనిపించేట్లు హంగు, ఆర్భాటంగా నాలా మారుతి ఎస్టీమ్ కారులో రయ్యిమని సాయంత్రాలు బీచ్‌లో షికార్లు కొట్టడమే ఆనందం అంటే'' అని. నాకిదీ సంతృప్తినివ్వలేదు.

ఇవన్నీ విన్నాక చిట్టచివరిగా అన్పించింది. నేనిక ఎప్పటికీ ఆనందం అంటే ఏమిటో తెల్సుకోలేనేమో అని.

ఆనందం అంటే ఏమిటో తెల్సుకోకుండానే నేను చనిపోతానేమోనని బెంగ పట్టుకుంది నాకు. అయినా నా శోధన ఆపలేదు.

ఆనందం గురించి ఆలోచన మొదలుపెట్టి అప్పుడే ఆర్నెల్లు దాటిపోయింది. కానీ నాకు మాత్రం ఆనందం అంటే ఏమిటో తెలీలేదు.

సరే ఒకరోజు ప్రొద్దుటే మార్నింగ్ వాక్‌కు వెళ్లి చాలాసేపు వాకింగ్ తరువాత పార్క్‌లో సిమెంట్ బెంచిపై సేదదీరుదామని కాసేపు కూర్చున్నాను. అక్కడా నన్నీ ఆలోచన వదల్లేదు. ముసలివాడ్నయి పోతున్నానేమో కాస్త కష్టపడితే దానికి పదింతలు ఆయాసం వస్తోంది.

ఈ ఆలోచనల్లో వున్న నా దృష్టి అనుకోకుండా ఒకమ్మాయి మీద పడింది.

నాకు పదడుగుల దూరంలో శూన్యంలోకి చూస్తూ వుంది. వయసు తొమ్మిది పది సంవత్సరాలు వుంటుందేమో? చిరుగులు పట్టిన స్కర్ట్, తైల సంస్కారంలేని జుట్టు, ముఖమంతా మాసికలు మాసికలుగా మట్టి పేరుకుపోయింది. ఎన్నో రోజుల్నుండి స్నానపానాల్లేనట్లుండా ముఖం. కళ్లు దేనికోసమో వెదుకుతున్నట్లు ప్రాణాలు కళ్లల్లోనే వున్నట్టున్నాయి. ఆ బెదురుచూపులు, స్థిరత్వంలేని అడుగులు ఇవన్నీ చూసాక ఇంట్లోంచి తప్పించుకుపోయిన బాపతేమో అని అనుమానం వచ్చింది. అసలే ఈ మధ్య రోజూ పేపర్లో ఈ కేసులు ఎక్కువగా కనబడుతున్నాయి.

లేచి ఆ అమ్మాయి దగ్గరకెళ్లి ''ఏయ్ పాపా! ఎవర్నువ్వు? ఇక్కడెందుకున్నావు?'' అనడిగాను.

అడిగీ అడగ్గానే కళ్లల్లో నుండి నీళ్లు రాల్తుండగా ''అమ్మా నాన్నా చిన్నప్పుడే పోయారు సామీ. మూడురోజులనుంచి అన్నం నీళ్లు లేవు. ఎక్కడికి వెళ్లాలో, ఏం చేయాలో తెలీడంలేదు. పొద్దుటే ముష్టడిగినా ఎవళ్లూ ఎయ్యరు. చాలా ఆకలిగా వుంది సామీ'' అంది.

ఒక్కక్షణం ఆలోచించి అన్నాను ''సరే అయితే మా

**దొడ్లో వాలుకుర్చీలో కూర్చున్న నా ఎదురుగానే ఆ పిల్లకు విస్తరేసి భోజనం వడ్డించింది మా ఆవిడ. రాత్రి మిగిలిపోయిన కూరలు, చద్దన్నం పెట్టినట్టుంది. విస్తర్లోకి చూసి తలెత్తిన ఆ పిల్ల కళ్లల్లోకి చూసిన నాకు అప్పుడు తెలిసింది నా ప్రశ్నకు జవాబు 'ఆనందం' అంటే ఏమిటో.**

ఇంటికొస్తావా? అన్నం పెడతాను''అని.

అంగీకారప్రాయంగా తలూపి నా వెంట నడిచింది.

ప్రపంచంలో అన్నింటికంటే ఆకలి చాలా భయంకరమైనదనుకుంటా. ఈ పిల్లను చూస్తే జాలేస్తోంది.

ఇంటికి తీస్కెళ్లాక విషయం సూక్ష్మంగా వివరించి నా భార్యను పిల్లకు అన్నం పెట్టమన్నాను. నన్ను కట్టుకున్ననాటి నుండి ఆవిడకిలాటివి అలవాటే. ఏమనుకుందో ఏమో నా ధర్మపత్ని సణుక్కుంటూనే ఆ పిల్లను బాత్రూంలోకి పంపి స్నానం చేయించి మా అమ్మాయి చిన్నప్పటి పాత బట్టల్ని కట్టుకోమని పురమాయించింది. స్నానం అయ్యాక తలకు నూనె రాసుకుని జడ వేసుకోమంది. ఇందాక నాతో వచ్చిన పిల్లకూ ఈ పిల్లకు ఎంత తేడానో? కడిగిన ముత్యంలా వుందిప్పుడు శుభ్రంగా. ఆ పిల్లను చూసి నాకు చాలా సంతోషమేసింది.

దొడ్లో వాలుకుర్చీలో కూర్చున్న నా ఎదురుగానే ఆ పిల్లకు విస్తరేసి భోజనం వడ్డించింది మా ఆవిడ. రాత్రి మిగిలిపోయిన కూరలు, చద్దన్నం పెట్టినట్టుంది. విస్తర్లోకి చూసి తలెత్తిన ఆ పిల్ల కళ్లల్లోకి చూసిన నాకు అప్పుడు తెలిసింది నా ప్రశ్నకు జవాబు 'ఆనందం' అంటే ఏమిటో.

ఎన్నో రోజులనుంచి వెదుకుతున్న నా ప్రశ్నకు జవాబు దొరికింది.

ఆనందం అంటే బ్యాంక్ బాలెన్స్‌లు, నౌకర్లు చాకర్లు, తిండి, ఇల్లు, బట్టలు, డబ్బు, నగలు, కార్లు, అప్పుల్లేకుండా జీవితం గడపడం, కాలు క్రింద పెట్టకుండా కూర్చున్న దగ్గరికే సకాలంలో అందించుకోగల స్థోమత ఇవేమీకావు.

అవసరాల్లో వున్న లేదా మనకంటే పేదవారైన వారికి మనకు చేతనైనంత సాయం చేసినప్పుడు వారి కళ్లల్లో మెరిసే మెరుపులే అసలైన ఆనందానికి నిర్వచనాలు. అవసరాల్లో వున్నవారికి చేతనైనంత సాయం చేయడమే అసలైన ఆనందం.

మరిప్పుడు నా ఆనందానికి అవధుల్లేవు. హమ్మయ్య! నా సమస్యకు అతి సాధారణమైన ఒక పిల్లద్వారా జవాబు దొరికింది.

★

